క్లుప్తంగా

పాఠశాలకు కుర్చీలు వితరణ



కుర్చీలు అందజేస్తున్న దాతలు

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు మంగళవారం కుర్చీలు వితరణ చేశారు. యల్లంకి వెంకటేశ్వరరావు, తులిశమ్మ దంపతుల కుమారుడు సతీష్‌కుమార్, రాజేశ్వరి దంపతులు రూ. 40,000 విలువ గల 70 కుర్చీలను హైస్కూల్ హెచ్ఎం పి.సంజీవరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంటి శ్రీనివాసరావు, మిర్యాల రమేష్, ఆఫీస్ సబార్డ్‌నేట్ కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీపీఎస్ 8వ దశ ప్లాంట్ నిర్మించాలి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: పాల్వంచలోని భౌగోళిక వనరులను వినియోగించుకుని కేటీపీఎస్ 8వ దశ ప్లాంట్ నిర్మించాలని ప్లాంట్ సాధన సమితి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కేటీపీఎస్ 5, 6 దశల చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ... కర్మాగారం నిర్మించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలన్నారు. కార్యక్రమంలో సాధన సమితి, కార్మిక సంఘాల నాయకులు కె.కోటేశ్వరరావు, ఎస్‌కే.యాస్మిన్, వై.రమేష్, ఎ.వెంకటేశ్వర్లు, భూక్యా రవి, ప్రతాప్, మంగీలాల్, సీహెచ్.గిరిధర్, ఆర్.శ్రీనివాస్, బాలాజీ, సాయిబాబు, రాములు, శివరామ్, అనిల్, పద్మ, సుదీర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్

టేకులపల్లి: సంగారెడ్డి జిల్లా పాశ మైలారంలో భవనం కూలి 40 మంది కార్మికులు మరణించడం, కొందరు కార్మికులు క్షతగాత్రులైన సంఘటన బాధాకరమని, ఈ దుర్ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ అన్నారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా టేకులపల్లి మండల కేంద్రంలో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మరణించిన కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి మెరుగైన వైద్య సౌకర్యం, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, వెంకన్న, వీరస్వామి, మహేష్, రఘు, రమేష్, రాజు పాల్గొన్నారు.

భూ దందాలపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: భూ దందాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గంట్ల శశిధర్‌రెడ్డి, మద్ది నాగమణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ... ప్రభాత్‌నగర్‌లో పెద్దమనుషులుగా చలామణి అవుతున్న అధికార పార్టీకి చెందిన నలుగురు వ్యక్తులు ఓ మంత్రి పీఏల పేరు చెప్పి భూదందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో భూముల క్రయవిక్రయాలు, బోర్‌వెల్ యంత్రాల వినియోగం వరకు వారి అనుమతి కావాలన్నారు. పోలీసుల సహకారంతో అమాయకులపై తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. కిన్నెరసాని కెనాల్ మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సైరెడ్డి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జెన్‌కో డైరెక్టర్లకు శుభాకాంక్షలు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో నూతన డైరెక్టర్‌లుగా బాధ్యతలు స్వీకరించిన వై.రాజశేఖర్ రెడ్డి(థర్మల్), ఎస్‌వీ.కుమార్ రాజు (హెచ్‌ఆర్, ఐఆర్), బి.నాగ్య (కోల్), జీ.వీరహేందర్(ఫైనాన్స్)లకు డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత సౌధలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ఎస్.సీతారామిరెడ్డి, జోనల్ సెక్రటరీ డి.శ్యామ్ సుందర్ రావు, జాయింట్ సెక్రటరీ కె.నరేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ఫిర్యాదులకు

మోక్షం కలిగేనా?



దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు (ఫైల్)

- గ్రామసభల్లో రేషన్ కార్డుల కోసం వినతులు ఇచ్చి ఆరునెలలు
- జాడ లేని రాజీవ్ వికాసం రుణాలు



కిన్నెరసానిలో ప్రజాపాలన గ్రామసభ (ఫైల్)

పాల్వంచరూరల్: అధికార ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో అధికారులు రేషన్‌కార్డులు, రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం బృందాలుగా దరఖాస్తులను విచారించి అర్హులను ఎంపిక చేశారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఇదంతా వేగంగా కొనసాగింది. కానీ నేటికీ అవి అమలుకు నోచుకోలేదు. ప్రజాపాలన దరఖాస్తుదారులకు కొంతమందికి మినహా ఎక్కువ దరఖాస్తుదాలను బుట్టలో వేశారు. గ్రామసభల్లోనే కాకుండా, మీ సేవ కేంద్రాల్లో కూడా దరఖాస్తులు చేసుకున్న వారికి కొంతమందికి కార్డులు మంజూరు చేశారు. అయితే చాలామందికి అవగాహన లేక మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోలేదు. వారికి కార్డుల మంజూరులో జాప్యం జరుగుతోంది.

మండల వ్యాప్తంగా.....

పాల్వంచ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన 2017 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా... పేర్ల మార్పిడికి 410 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 537 దరఖాస్తులను మాత్రమే విచారించగా, 502 మాత్రమే అర్హులుగా గుర్తించారు. మిగిలినవి పరిశీలనకు నోచుకోలేదు. మరో 15 దరఖాస్తులు అసలు అర్హులే కారని తేల్చేశారు.

దరఖాస్తులు ఇలా...

అర్హులైన కుటుంబాలు స్థానిక మీ సేవ కేంద్రాల్లోకి వెళ్లి కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఓటరు కార్డులతో నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకుని నేరుగా తహసీల్‌కు వెళ్లి అందజేయాలి. అనంతరం రెవెన్యూ ఆర్ఐలు విచారణ జరిపి డీఎస్ఓ కార్యాలయానికి నివేదిక ఇస్తారు. ఆ తర్వాత కొత్త రేషన్‌కార్డు మంజూరు అవుతుంది.

రాజీవ్ వికాసం కోసం 2,446 దరఖాస్తులు..

మండలంలో రాజీవ్ వికాసం కింద రుణాలకు రెండు నెలలక్రితం 2,446 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులోఎస్టీలు 1,092, ఎస్సీలు 332, బీసీలు 973, ఈబీసీలు 22, క్రైస్తవులు 2, ముస్లింలు 25 మంది దరఖాస్తు చేసుకోగా రూ.50వేల రుణాల కింద 15మంది అర్హులుగా గుర్తించారు. రూ.లక్ష రుణం కింద 31మందిని అర్హులుగా గుర్తించారు. కానీ నేటికీ రుణాలు మంజూరు చేయలేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరునెలల క్రితం దరఖాస్తు ...



ప్రజాపాలన గ్రామసభలో నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. ఆరునెలలు గడిచింది. నేటికి రేషన్ కార్డు మంజూరు చేయలేదు. ఎవరిని అడిగినా వస్తుంది అంటున్నారు. ఇదేం ప్రజాపాలనో ఏమో. – మల్లేశం, సోములగూడెం

అధికారులు స్పందించాలి..



రేషన్‌కార్డు కోసం ప్రజాపాలన సభలో దరఖాస్తు పెట్టుకున్నా ఇంత వరకు మంజూరు కాలేదు. అధికారులు స్పందించి నూతన రేషన్ కార్డులను మంజూరు చేయాలి. గత ప్రభుత్వ హయాంలోనే బాగుంది. – హిమత, పాండురంగాపురం

అనుమతులు రావాల్సి ఉంది..



అర్హులు ఆధార్‌కార్డుతో మీసేవలో దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి అప్‌లోడ్ చేస్తాం. ప్రజాపాలనలో 2,017 దరఖాస్తులు రాగా పరిశీలించి 502 మందిని అర్హులుగా గుర్తించాం. అనుమతులు కార్డులు ఇస్తాం. – దారా ప్రసాద్, తహసీల్దార్

ఇళ్ల నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి



కొమరారంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం కొమరారం పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులకు సమాచారం చేరవేయాలని చెప్పారు. కార్యక్రమంలో బానోత్ రాంబాబు, జనగం కోటేశ్వరరావు, పోలేపల్లి నాగేశ్వరరావు, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, డాక్టర్ లోహిత, హౌసింగ్ ఏఈ స్వాతి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టేకులపల్లి: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద టేకులపల్లి మండలానికి 21 క్వింటాళ్ల కంది విత్తనాలు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం కోయగూడెం గ్రామంలో వాటిని రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. టేకులపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు పురుగు మందుతో విత్తన శుద్ధి చేసి వచ్చాయి కనుక తినడానికి వాడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జి.లాల్‌చంద్, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈఓ వై.శ్రావణి, ఎస్ఐ రాజేందర్, ఉమ, పోశాలు, వీరభద్రం, సంజయ్, పెరుగు సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు




మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు తప్పవని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని ఫీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆపరేషన్ ముస్కాన్11పై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ... బాలకార్మికులపై నిఘా ఉంచాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ 11 కార్యక్రమంలో పోలీసుశాఖ, చైల్డ్ వెల్ఫేర్, లేబర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు కమిటీలో ఉంటారని చెప్పారు. గతంలో రెస్క్యూ చేసిన పిల్లల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. జూలై 1 నుంచి నెలరోజుల పాటు జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బాల కార్మికులను గుర్తించి రక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. కిరాణాషాపు, మెకానిక్, హోటళ్లు, ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలలో బాలలతో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. బిక్షాటన చేస్తున్న సమాచారం తెలిస్తే తక్షణమే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. బాలకార్మికులను గుర్తిస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని తల్లిదండ్రులకు లేదా సంరక్షణ గృహాలకు అప్పజెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీపీఓ హరికుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఫక్రుద్దీన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్, ఎస్సై రమాదేవి, విజయకుమారి, ఏసోబు, సూర్యం పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఇఫ్టూ అనుబంధ జీపీ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ, అఖిలపక్షం నాయకులు మంగళవారం పిలుపునిచ్చారు. మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరగనున్న సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు



టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీలో సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం



ఇల్లెందు: మున్సిపల్ మేనేజర్ అంకుషావలీకి నోటీసు అందజేస్తున్న నాయకులు



జూలూరుపాడు: మాట్లాడుతున్న జమలయ్య

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 3వ తేదీన కొత్తగూడెం బాబుక్యాంపులోని ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శ్రీరామ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ – 25, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ – 25, మొత్తం 50 ఖాళీలలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 18 – 30 సంవత్సరాలు కలిగి, డిగ్రీ ఉత్తీర్ణులు అయినవారు అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

104శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో ఉందని ఏరియా జీఎం వి.కృష్ణయ్య వెల్లడించారు. మంగళవారం ఇల్లెందులోని తన చాంబర్‌లో వివరాలు వెల్లడించారు. 2025 జూన్‌లో నిర్దేశించిన లక్ష్యం 2.15 లక్షల టన్నులకు గానూ 2.24 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తిని చేసి 104 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారులు, యూనియన్ నాయకులను అభినందించారు.

ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఇవ్వాలి..

కొత్తగూడెంటౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ పంపు కనెక్షన్ ఇవ్వాలని రామవరం కాంగ్రెస్ యువజన నాయకులు బానోతు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం చిట్టి రామవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామవరం, రుద్రంపూర్, టూ, త్రీ, ఫోర్ ఇంక్‌లైన్లకు, గౌతంపూర్, ధన్‌బాద్‌లతో పాటు పలు ప్రాంతాల్లో పంపు కనెక్షన్లు లేవన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. గుగులోతు భాస్కర్, బోడ హరిలాల్, మాలోతు వీరన్న పాల్గొన్నారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

పాల్వంచరూరల్: పాండురంగాపురం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ట్రైకార్ చైర్మన్, ఆదివాసీ జాతీయ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బెల్లయ్యనాయక్ జన్మదినం సందర్భంగా మంగళవారం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి దేవీలాల్ నాయక్ పంపిణీ చేశారు. మంజూరు, హెచ్ఎం శ్రీనివాస్, వెంకట్రామయ్య, అంకయ్య, సోమయ్య, భాషా, నాగరాజు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలంపాట

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో టెండర్ కం బహిరంగ వేలంపాటలను బుధవారం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లు, కొత్త, పాత కాంప్లెక్స్‌లోని షాపులకు లైసెన్స్ హక్కులు పొందేందుకు వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐ కార్యవర్గం ఎన్నిక

టేకులపల్లి: టేకులపల్లి మండల సీపీఐ నూతన కార్యదర్శిగా గుగులోత్ రామ్‌చందర్ తిరిగి ఎన్నికయ్యారు. పార్టీ మండల 13వ మహాసభ సోమవారం జరిగింది. హాజరైన జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, ఇల్లెందు కార్యదర్శి కె.సారయ్య మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం నూతన కమిటీ వివరాలు వెల్లడించారు. కార్యదర్శి వర్గం ఐదుగురు, కార్యవర్గం 11 మంది, కౌన్సిల్‌కు 27 మందిని ఎన్నుకున్నారు.

'మా తండాల్లో మా రాజ్యం..'



అభివాదం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: మా తండాల్లో మా రాజ్యం.. లంబాడీ హక్కుల కోసం నిరంతరంగా పోరాటం చేస్తామని లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) నంగారాభేరి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంతుల్యా నాయక్ అధ్యక్షతన ఎల్‌హెచ్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి, మారోజు వీరన్న, ఠాను నాయక్‌ల ఆశయాల దిశగా లక్ష్యసాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. బహుజన విప్లవ కెరటం మారోజు వీరన్న సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న లంబాడా జాతిని రాజ్యాధికారం వైపు నడిపించడానికి ఉద్యమించాడని కొనియాడారు. 1997 జూలై1న లంబాడాలను చేరదీసి మాతండా మారాజ్యం.. నినాదంతో ఎల్‌హెచ్‌పీఎస్‌ను స్థాపించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి సమస్యలపై పోరాటం చేస్తూ హక్కులను సాధించుకునే దిశగా అడుగులు వేశామని తెలిపారు. పలు హక్కులు సాధించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లెల రామనాథం, కురిమెళ్ల శంకర్, వాసం రామకృష్ణ, పాయం సత్యనారాయణ, ఇర్ప ప్రకాష్, రమేష్, లాలు, జానకిరాం, గోబ్రియా, జుంకీలాల్, బోడలాల్, ఉపేందర్, చిట్టిబాబు, కుశాల్, రాము, వీరన్న, జానకీరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా..

టేకులపల్లి: ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు పండిస్తున్న రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్, టేకులపల్లి ఏఓ నీరుడు అన్నపూర్ణ అన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్నలో యూరియా వాడటం సరైన పద్ధతి కాదన్నారు. గింజ నుంచి మొట్టమొదటగా వేరు వ్యవస్థ వస్తుంది కనుక వేర్లు అభివృద్ధి చెందడానికి భాస్వరం అవసరం ఉంటుందని పేర్కొన్నారు. తొలి దశలో డీఏపీ 20:20:0:13, 28:28, 14:35:14 వంటి ఎరువులలో నత్రజని, భాస్వరం, పోటాష్ కూడా ఉంటుందని వాటికి యూరియా కలపొద్దని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి..



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని, సీజనల్ వ్యాధులు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, వైరల్ ఫీవర్స్ ప్రబలకుండా డ్రైడే నిర్వహించాలని సూచించారు. మురుగునీటి గుంతల్లో యాంటీ లార్వాలను గుర్తించి ఫైరిత్రం, కీమోపాస్ వంటి రసాయనాలను చల్లించాలన్నారు. సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్విని, సీహెచ్ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు రాధిక, ప్రియదర్శిని, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎంలు తార, రీనా, రాణి, సావిత్రి, పార్వతి, ఆదిలక్ష్మి, ఝాన్సీరాణి, మంగమ్మ, అనూష, సుజాత, నాగలక్ష్మి, సుశీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంపెనీ ఆస్తులు కాపాడాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కంపెనీకి సొత్తు దొంగతనం జరగకుండా కాపాడాలని, ఆస్తుల పరిరక్షణకు ప్రతీ ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని జీఎం సెక్యూరిటీ సీహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల సెక్యూరిటీ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... ఏరియాలోని అన్ని చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. ప్రతీ పోస్టు వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని, కంపెనీ పనులకు ఆటంకం కలిగించే వారిపై నిఘా పెంచాలని, ఏరియా సెక్యూరిటీ అధికారులను ఆదేశించారు. ఏరియాకు సంబంధించిన అన్ని అంశాలపై వెంటనే రిపోర్ట్స్ అందజేయాలని, సెక్యూరిటీ గార్డుల సామర్థ్యం పెంచుటకు తగిన ట్రైనింగ్ ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని తద్వారా కంపెనీ గార్డ్స్‌లతోపాటు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సక్రమంగా పనిచేయాలని లేదంటే కాంట్రాక్టర్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జే.వేణుమాధవ్, వివిధ ఏరియాల సెక్యూరిటీ అధికారులు పాల్గొన్నారు.

రాజేష్ కుటుంబాన్ని ఆదుకోండి..



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న మోహన్

కొత్తగూడెంఅర్బన్: సమగ్రశిక్షా లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ తక్షణమే మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ప్రమాదవశాత్తు ఉద్యోగం చేస్తూనే మరణించిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలం కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న బత్తుల రాజేష్ ప్రమాదవశాత్తు మృతి చెందారని, అతని కుటుంబానికి ఎటువంటి ఆసరా లేదని, ప్రభుత్వం అన్ని రకాల బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బట్టు చందు, వనమా సురేష్, కిరణ్మయి, శ్రావణి పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎన్ఐఎస్ కోఆర్డినేటర్ రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మండల విద్యావనరుల కేంద్రం ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో రాజేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. రాజేష్ కుటంబానికి ప్రభుత్వం రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఆనంద్, సూర్నపాక సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏఐఎస్ఎఫ్ మహాసభ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఫహీందాదా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. అన్ని మండలాల నుంచి విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అజిత్, రణధీర్, కమల్, శివ, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

ఇల్లెందు: ఏఐఎస్ఎఫ్ జిల్లా 4వ మహాసభ ఈ నెల 3న పాల్వంచ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వి.హరీష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఇల్లెందులో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఏఐఎస్ఎఫ్ రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు ప్రణాళికకు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి, రవి, శివ, గణేష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వాస్పత్రుల్లో, పీహెచ్‌సీల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ... డాక్టర్ బీసీ రాయ్ వైద్యసేవలను గుర్తించిన ప్రభుత్వం 1991 నుంచి ప్రతీ ఏటా జూలై 1న డాక్టర్స్‌డేగా జరుపుకుంటున్నామన్నారు. సమాజం పట్ల వైద్యుల బాధ్యత, సేవలను గుర్తుచేశారు. సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణ కోసం పారామెడికల్ సిబ్బందితో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని కోరారు. వైద్యులను ఘనంగా సన్మానించారు. – కొత్తగూడెంఅర్బన్/సింగరేణి(కొత్తగూడెం)/జూలూరుపాడు



కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో వైద్యుడిని సన్మానిస్తున్న దృశ్యం



జూలూరుపాడు: వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం